

# కథా కౌముది

"శ్రీ పరాభవ" నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
31 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

## రాజయోగిని ఊర్మిళ

డా. సి.యస్.జి. కృష్ణమాచార్యులు, పుదుచ్చేరి, భారత దేశం

**"ఊర్మిళ. విదేహ రాజ తనయ**. విద్యావినయ సంపన్నురాలైన ఒక మహాయోధ. త్యాగ రథమెక్కి జీవన యానం సాగించిన ఒక యోగిని. ఆమె కథ మహిళాభ్యుదయం కోసం నినదించే వారికందరికీ స్ఫూర్తిదాయకం." అన్నారు సదానంద యోగి.

"స్వామీ! ఊర్మిళ అంటే నిదురించిన యువరాణియని టీవీ సీరియల్సులో చూపించారు. అది నిజం కాదా? ఆమె కథ చెప్పండి. " అని అడిగారు శ్రోతలు.

"తప్పక చెబుతాను. శ్రద్ధగా వినండి."అన్నారు సదానంద యోగి నిర్మలమైన చిరునవ్వుతో.

ఆయన చెప్పిన కథ ఇలా వుంది.

జనకునికి నాగేటి చాలున సీత దొరికిన కొద్ది రోజులకే మహారాణి సునయన గర్భవతైంది. ఆ సమయంలో జనకునికి ఒక వింత కల వచ్చింది. ఆదిశేషునికి ఆధారభూతమైన క్షీర సాగర సముద్రం పొంగి పొరలుతూ దర్శనమిచ్చింది. శతానంద మహర్షి, ఆ కల యొక్క మర్మాన్నిలా విప్పిచెప్పాడు.

" మీకు క్షీర సాగర అంశలో కుమార్తె కలుగుతుంది. ఆమె ఇప్పటికే భూలోకంలో అవతరించిన మహా లక్ష్మి ని సేవించడం కోసం, ఆదిశేషునికి అర్ధాంగి కావడం కోసం, జన్మించబోతోంది."

ఆ విషయాన్ని జనకుడు తన అర్ధాంగి సునయనకు చెప్పినప్పుడు,ఆమెకు ఒక దేవతామూర్తిని ఆడపిల్లగా కంటున్నందుకు ఆనందపడాలో, వంశోద్ధారకుడు జన్మించబోడని నిరాశ చెందాలో అర్థం కాలేదు. అంతా ఆ శ్రీ మహాలక్ష్మి కృపయని మనసుకు సర్ది చెప్పుకుంది. తొమ్మిది నెలల తర్వాత, సర్వలక్షణ శోభితయైన అందాల పాప కు జన్మనిచ్చింది. ఆ శిశువుకి శతానంద మహర్షి, ఊర్మిళ అని నామకరణం చేసాడు. ఊర్మిళ అంటే అలల సౌందర్యాన్నికలిగినది.

సత్వ గుణ సంపన్నమైన బ్రహ్మలోకంలా ప్రకాశించే, మిథిలా రాజమందిరంలో, రాజ నీతిజ్ఞురాలైన సునయన మాతృ ప్రేమ సుగంధాన్ని అస్వాదిస్తూ, సీత, ఊర్మిళలు వికసించిన పుష్పాల వలె పెరిగారు. జనకుడు స్త్రీ పురుషుల సమానత్వాన్ని గౌరవించే వేద కాల సాహిత్యాభిమాని కావడాన, ఆయన తన ఇద్దరు కుమార్తెలు గార్గి, మైత్రేయిల వలే విద్వాంసులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించాడు. ఆయన రాజ గురు వైన, శతానందుల వారికి తన కుమార్తెలను విద్యా పారంగతులుగా చేసే బాధ్యత నప్పగించాడు. పట్టమహిషి సునయన ఒక అడుగు ముందుకు వేసి, కుమార్తెలకు యుద్ధ విద్యలో కూడ శిక్షణ నివ్వమని అభ్యర్థించింది. స్త్రీలు రాణించేందుకు ఎన్నో రంగాలుండగా ఈ సైనిక రంగమెందుకని ఆయన మొదట వ్యతిరేకించినా, తర్వాత భార్య కోరికకు తల యొగ్గాడు.

సీత స్వభావం భూమి వంటిది. ఆమె స్నేహ పూర్వక ప్రవర్తన, మృదు భాషిత్వం, సహనం వంటి సుగుణాలవల్ల వల్ల నలుగురికీ ఆదర్శప్రాయమైన వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకుంది. యుద్ధవిద్యలో తగు ప్రావీణ్యం సంపాదించి తల్లి మెప్పు సాధించినా, ఆమె మనసు, అధికంగా వేదాంత గ్రంధాల వైపు మ్రొగ్గేది.

ఊర్మిళ వ్యక్తిత్వం సముద్రుని వంటిది. ఆమె మనసు గంభీరంగా వుంటూనే, వుప్పొంగుతూ వుంటుంది. ఆమె చర మనస్తత్వానికి యుద్ధ క్రీడ యెంతో నచ్చింది. ఆమె ఖడ్గ విద్యలో యెనలేని ప్రావీణ్యాన్ని సాధించింది. పదమూడేండ్ల ప్రాయం వచ్చేసరికి, ఆమె కీర్తి మారుమూల జనపదాలకు కూడ వ్యాపించింది. ఆర్యావర్తంలోనే, సాటిలేని మేటి యోధగా ఆమెను జనం కీర్తించడం ప్రారంభించారు. ఇది ఆ రాజ్యంలోని కొందరు సైనికాధికారులకే కంటగింపుగా మారింది. తనను జయించమని, శివదత్తుడనే సైనికాధికారి, తన అనుచరులతో కలిసి ఊర్మిళకు సవాలు విసిరాడు.

ఆ సవాలుని సునయన మహిళా శక్తి గొప్పతనాన్ని నిరూపించేందుకు, శివదత్తుని తిరుగుబాటు వెనుక వున్న విదేశీ శక్తులకు గుణ పాఠం చెప్పేటందుకు, ఒక మంచి అవకాశంగా తీసుకుంది. కష్టపడి జనక మహారాజును ఒప్పించి, సవాలు యుద్ధానికి యేర్పాట్లు చేసింది. ఖడ్గవిద్యలో పదహారు కళలను అభ్యసించిన ఊర్మిళ వుత్సాహానికి అంతే లేదు.

ఆమె నిదానంగా శివదత్తుని యెదుర్కొని అతడు ప్రదర్శించిన కళలకు దీటుగా సమాధాన మిచ్చింది. సింహ గర్జన, చక్రవాతి,వజ్రపాత,గరుడ పాతం, చతుర్భుజ రక్షణ, నాగ పాశం వంటి కళలను ప్రయోగించి అతడిని నిరాయుధుని చేసింది. శివదత్తుడు ఆమె లాఘవానికి, నైపుణ్యానికి బిత్తరపోయి ప్రాణాలు అరచేత బట్టుకుని పలాయనం చిత్తగించాడు. ఇది గమనించిన అతని అనుచరులు నలుగురు అశ్వారూఢులై, కత్తులు ఝళిపిస్తూ, ఆమెపై విరుచుకుపడ్డారు. అది అధర్మ యుద్ధమని నిర్వాహకులు వారిస్తున్నా, వారు వెనుకకు తగ్గలేదు.

ఊర్మిళ నిర్వికారంగా ముందుకు దూకి, రెండే రెండు క్షణాలలో ముందున్న రెండు గుర్రాల ముంగాళ్ళను కత్తితో నరికివేసింది. నేల కూలిన యోధులు తేరుకునే లోపు వారిని తీవ్రంగా గాయ పరిచి, తన ఖడ్గ విన్యాసాలతో అక్కడ భీతావక పరిస్థితిని నెలకొల్పింది. అడుగు ముందుకు వేస్తే తల తెగిపడడం ఖాయం. అది ఖడ్గమా, మెరుపు తీగా? ఆమె మణికట్టు చక్రంలా తిరుగగా, ఖడ్గపు అంచు మెరుపు జ్వాలలతో నాట్యం చేసింది. అది నారాయణుని చక్రాయుధమా లేక కోటి సూర్యుల కాంతి పుంజమా? బంగారు ఛాయ లో మెరిసే,ఆ పదమూడేండ్ల బాలిక, ఊర్వశియా, మహా కాళియా? ఆ మధుర మనోహర దరహాసమెక్కడ? ఈ క్రోధ సంభూత వికటాట్ట హాసము లెక్కడ? బ్రతికి వుంటే బలుసాకు తిన వచ్చునని మిగిలిన వారు శరవేగంతో ఆ రణ క్రీడా మైదానం నుంచి పారిపోయారు.

ప్రేక్షకుల హర్షధ్వానాలు మిన్ను ముట్టాయి. సీత పరుగున వెళ్ళి "జయము జయము, మిథిలానగర యువరాణీ! నా బంగారు చెల్లీ! “అంటూ చెల్లెలిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంది. ఆ విజయోత్సాహంలో కూడా ఊర్మిళ తన అక్కను గౌరవించడం మానలేదు.

" నీవే మా యువరాణివి. ఈ రాజ్యానికి, నా హృదయానికి. ఈ విజయం నీదే "అంటూ సీత కౌగిలిలో ఒదిగిపోయింది.

వారి మాటలు విన్న సునయన మనసు సంతోష భరితమైంది. ఆమె ఊర్మిళ చేయి ఎత్తిపట్టుకుని, "మహిళా సైనికుల గౌరవాన్ని నిలబెట్టిన ఊర్మిళను అభినందిస్తున్నాను" అని ప్రకటించింది. అంతే జయ జయ ధ్వానాలతో మైదానం మార్మోగింది.

రాత్రి తొలి జాము ముగిసింది, సునయనకు నిద్ర రావడం లేదు. జనక మహారాజు వ్యూహ మందిరంలో ఈ రోజు జరిగిన తిరుగుబాటు గురించి, సమీక్షిస్తున్నారని ఆమె ఆంతరంగ పరిచారిక చెప్పింది. ఆ నిశ్శబ్ద, నీరవ నిశీథిలో ఆమె ఆలోచనలు కూతురు ఊర్మిళ చుట్టూ పరిభ్రమించ సాగాయి.

ఊర్మిళ గెలుపు ఊహించినదే. కానీ, ఆమె ఆ అసమాన నైపుణ్యాన్నెలా సాధించినదన్నది వూహ కందడంలేదు. ఒక ప్రక్క సంగీతం, చిత్రలేఖనం, మరొక ప్రక్క రాజనీతి, ప్రపంచ జ్ఞానం, సాహిత్యం. ఇవన్నీ గాక ఈ యుద్ధ విద్య. గత పదేళ్ళుగా ఈ బహుముఖ సాధన జరుగుతోంది. నిలకడలేని ఊర్మిళ ఇదంతా సాధించిందంటే, ఆ గొప్పదనం సీతకే

చెందుతుంది. తనకంటే కేవలం యేడాది చిన్న దైన చెల్లెలిని, ఒక బిడ్డలా లాలిస్తుంది. మమకారంతో కర్తవ్యబోధన చేసి, అందరూ గర్వపడేలా ముందుకు సాగమని ప్రోత్సహిస్తుంది. అదేమి మాయో, ఊర్మిళకు అక్క మాట శిలాక్షరం. వారిద్దరిదీ ఒకే ఆత్మ అని అనిపిస్తుంది. గిట్టని వారు, సీత పట్ల ఊర్మిళ మనసు విరిచే ప్రయత్నం చేసారు.

"నీ తల్లి దండ్రులు దొరికిన బిడ్డని దేవత అని చెప్తూ, సకల మర్యాదలు చేస్తున్నారు. ఆమెనే యువరాణియని, వైదేహియని, మైథిలియని, జానకి అని పిలుస్తున్నారు. నిజానికి ఆ గౌరవం నీకుగదా దక్కాలి. ఇంత అన్యాయం యెక్కడా వుండదు. నువ్వు నీ హక్కుల కోసం నీ తల్లిదండ్రులని, సీతని యెదిరించు." అని ఎన్నో రకాలుగా వుద్బోధ చేసారు. అయినా ఊర్మిళ. తన అక్క పట్ల తన అనురాగాన్ని మరింత పెంచుకుందే గాని, వారి మాటలు పట్టించుకుని, వ్యతిరేకత పెంచుకోలేదు.

పుత్రికల అనుబంధం తలపుకురాగానే ఆమెలో మాతృప్రేమ వెల్లువై పొంగింది. ఆమె లేచి నేరుగా సీత శయన మందిరానికి వెళ్ళింది. ఆమె సరిగ్గానే వూహించింది. ఊర్మిళ అక్కడే వుంది. సీత ఉదరంపై తల పెట్టుకుని హాయిగా నిద్రపోతోంది. అంతులేని మమకారంతో ఆమె,తాకీ తాకనట్లుగా, పుత్రికల నుదుటన ముద్దు పెట్టి, తన శయన మందిరానికి వెళ్ళిపోయింది.

ప్రాతః సంధ్యా సమయం. తెలిమంచు చినుకులు తాకిన పువ్వులు, మెల్లగా రేకులు విచ్చుకుంటూ సూర్యోదయాన్ని స్వాగతిస్తున్నాయి. పక్షులు తమ కిలకిలా రావములతో ప్రకృతి వైభవాన్ని కీర్తిస్తున్నాయి. రాజోద్యానవనంలోని పూల మందిరంలో ఊర్మిళ ఏకాంతంగా కూర్చుని, తను గీసిన చిత్రానికి తుది మెరుగులు దిద్దుతోంది. ఆ చిత్ర సౌందర్యాన్నిచూస్తూ వాయువు తన గమన వేగాన్ని తగ్గించాడు. అంతలోఆమె ఏకాగ్రతను భంగం చేస్తూ, ఒక పరిచారక వచ్చి, ఆమెకు అభివాదం చేసి, మహా రాణీ గారు, మిమ్మల్ని సత్వరమే రమ్మంటున్నారన్న సందేశాన్ని వినిపించింది.

ఇంత వుదయమే తల్లి ఎందుకు రమ్మంటున్నదా అని ఊర్మిళ యోచించింది. ఈ మధ్య,అమ్మకి కూతుళ్ళ పెళ్ళి చేయాలన్న ఆరాటం పెరిగినట్లు వినవస్తోంది. ఆ విషయంగా చర్చిందానికి పిలుస్తోందా? అందుకే, నిన్న మాండవి, శ్రుతకీర్తిలను, మిథిలకు రప్పించిందా? సీత ఎక్కడుంది? ఆలయ దర్శనం పూర్తి చేసుకుని తిరిగి వచ్చి వుంటుంది. చూద్దాం, వ్యవహారమేమిటో?

సునయన మందిరంలోకి అడుగుపెట్టిన ఊర్మిళకు అనురాగభరితమైన ఒక దృశ్యం కనబడింది. సునయన ఒక పట్టుపరుపుల ఆసనం పై కూర్చుని, సీత చేయి పట్టుకుని సంభాషిస్తోంది. క్రింద తివాచీ మీద ఆమెకి ఇరువైపులా మాండవి, శ్రుత కీర్తిలు కూర్చొని, ఆమె తొడలపై తలవాల్చి ఆమె చెప్పే కబుర్లు వింటున్నారు. ఊర్మిళ మనసు ప్రేమసుధాపూర్ణమైంది. ఆమె పరుగున వెళ్ళి, తల్లి వెనుకగా నిలబడి, ఆమె మెడ చుట్టూ చేతులు వేసింది.

"వచ్చావా తల్లీ! " అని ఆప్యాయంగా ఊర్మిళ చేతులను స్పృశించిన పిమ్మట, ఆమె స్నిగ్ధ స్వరంతో

ఇలా చెప్పింది.

“అందరూ వినండి. మీ పెళ్ళిళ్ళ గురించే నా ఆలోచనలు. ఇవి యెలా చేస్తానా అని తెలియని భయం నన్ను నిద్రపోనివ్వడం లేదు. శివధనుర్భంగం చేస్తే గాని సీత పెళ్ళి కాదు. అది మానవ మాత్రుడెవ్వడైనా చెయ్యగలడా? ఇంక ఊర్మి, దాని పరాక్రమాన్ని మెచ్చి చేసుకునే వారుంటారా? నాకు బెంగలేనిది ఈ చిన్నారుల గురించే."

తల్లి భయాన్ని పోగొడుతూ ఊర్మిళ యిలా అంది."అమ్మా! నీవు కోరినట్లు అక్క ప్రతి రోజూ క్రమం తప్పకుండా గుడికి వెళ్ళి వస్తోంది. ఆ దేవుడిని నమ్మిన నీకింక భయమెందుకు? అక్క కోసం ఎక్కడో, నారాయణుడు పుట్టే వుంటాడు. నగరాలను దాటి, అరణ్యాలను అతిక్రమించి, పర్వత శ్రేణులను అధిరోహించి, గంభీర జలధులను ఉల్లంఘించి సీతా! నా సీతా! అని పిలుస్తూ, వస్తాడు.”

"ఊర్మి గురించి బెంగ ఎందుకమ్మా! చెల్లి అసమాన సౌందర్యానికి ముగ్ధుడు కాని మానవ మాత్రుడుంటాడా? ప్రయత్నించి చూడు. దానికోసం ఒక మహా సంగ్రామం జరిగినా ఆశ్చర్యం లేదు." అంది సీత కొంటె నవ్వులు నవ్వుతూ.

వారి మాటలతో కొంత సాంత్వన పొందిన సునయన,"మీ మాటల్లో నిజమెంత వుందో తెలియదు. కానీ వింటూంటే, భయం పోతోంది. అలాగే జరుగు గాక!" అని అంది .

మాండవి లేచి నిలబడి, "ముందు సీతక్క స్వయంవరం ప్రకటించండి. శుభారంభం, కల్యాణ ప్రదమైన ముగింపు నిస్తుంది" అని అంది.

" అవునమ్మా! అక్క దేవత కదా, ఆమె కల్యాణంతో బాటే, మా అందరి కల్యాణాలు జరిగిపోతాయి. ఆ నిజాన్ని విస్మరించి, నువ్వు లేని పోని బెంగలతో నీ ఆరోగ్యం పాడు చేసుకోకు "అని శృత కీర్తి ప్రేమగా మందలిస్తూ చెప్పింది.

పుత్రికల ఆప్యాయత, వారి విశ్వాసాలు, సునయనకు ఎంతో వుపశమనం కలిగించాయి. ఆమె చిరునవ్వుతో, " నాన్నగారు త్వరలో సీతా స్వయంవరం ప్రకటిస్తున్నారు. ఆ విషయం మీకు చెప్పమన్నారు. ఊర్మిళ విషయంలో ఒక హెచ్చరిక కూడా చేసారు. సభలో యేదైనా గొడవ జరిగితే, దూకుడుగా మాటాడడం, కత్తి దూయడం వంటివి చెయ్యవద్దని చెప్పారు. స్త్రీలు పూలమాలికల్లా గుబాళించాలేగాని, సర్పాల్లా బుసలు కొట్టకూడదని హితవు పలికారు."

ఊర్మిళ ముఖం కోపంతో జేవురించింది."అంటే, స్త్రీలు సభలో అలంకార వస్తువుల్లా వుండాలా? వారికి సాటిమనిషిగా గుర్తింపు, మాట్లాడే స్వేచ్ఛలేదా?"

"నీకు స్వేచ్ఛవుంది. కానీ దానికి పరిమితులుండాలి. నీకు పరాక్రమం వుంది. కానీ దాని ప్రదర్శనకు సమయం సందర్భం వుండాలి. నియమాలు లేని ప్రవర్తన వినాశకరమవుతుంది. పెళ్ళికావల్సిన పిల్లలా, సాధువుగా వుండాలని, మీ తండ్రిగారి కోరిక."

సీతకు ఊర్మిళ ఆత్మాభిమానం దెబ్బతిందని అర్ధమైంది. ఆమె ఊర్మిళకు మద్దతుగా ఇలా అంది

"దేశం గురించి, జననీ జనకుల గురించి ఎవరైనా అవమానకరంగా మాట్లాడినా, ప్రవర్తించినా, ఏ దేశ యువరాణి చేతులు కట్టుకుని కూర్చోదు. ఒకరి మెప్పుకోసం అణిగిమణిగి వుండదు."

సీత మద్దతుకు సంతోషిస్తూ, ఊర్మిళ " నా అక్క గురించి చెడు మాట అన్న వాడి నాలుక తెగ్గొట్టకుండా వుండను. నన్ను క్షమించి, నాకు స్వేచ్ఛనిమ్మని తండ్రిగారికి చెప్పు" అని అక్కడనుండి వెళ్ళిపోయింది.

"ఏమిటి సీతా! నువ్వు దాన్ని సమర్థించావు? జనక మహారాజు అంటేనే శాంత స్వరూపం. అందుకు భిన్నగా మనం ప్రవర్తించడం రాజ ద్రోహం కాదా?"

"దిగులెందుకమ్మా? ఊర్మిళ మనసు నవనీతం లాంటిది. నువ్వు నిశ్చింతగా వుండు. రేపు సభలో నా కన్నా సహనంతో అది ప్రవర్తిస్తుంది."

"ఏమో తల్లీ. దాని మనసు నీకే తెలియాలి" అని నిట్టూర్చింది సునయన.

సీతా స్వయంవర పోటీ పరీక్ష ప్రారంభమైంది. ఒకరొక్కరుగా రాజులు వచ్చి, ధనస్సుని కదల్చలేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇదంతా ముందే ఊహించిన ఒక వర్గం రాజులు, జనకునిపై విమర్శకు

సిద్ధమై వచ్చారు. వారి తరపున ఒకరాజు, ఎలుగెత్తి యిలా నిలదీశాడు.

"ఇదేమి పరీక్ష! మహదేవుని విల్లునెక్కుపెట్టడం అపచారం, అసాధ్యం కాదా! పొలంలో దొరికిన బిడ్డట! దేవతయట! ఈ విల్లుని కదిల్చిందట! ఈ అసత్య, అసంబద్ధ ప్రచారం రాజలోకం నమ్మడమే, వింత గొలుపుతోంది. ఈ పరీక్షని రద్దు చేసి, మాలో ఒకరిని ఎన్నుకోమని చెప్పండి."

ఊర్మిళ రక్తం సలసల మరిగింది. కానీ సీత కిచ్చిన మాటకు కట్టు బడి, ఒక వింత చూస్తున్న బాలికలా ఆశ్చర్యాన్ని నటిస్తూ కూర్చుండిపోయింది. ఆమెనలా చూసిన సునయన, ఆపద తొలగిందని గాఢంగా నిట్టూర్చింది. ఇంతలో విశ్వామిత్ర మహర్షి కలగ చేసుకుని, వారిని శాంతింప చేసి రామచంద్రునికి అవకాశమిచ్చారు. విల్లు విరిగింది. సీత రాముని వరించింది. సభలో హర్షధ్వానాలు చెలరేగాయి.

ఆ తరువాత జరిగిన వరుస సంఘటనలు, శ్రుతకీర్తి, సునయనతో అన్న మాటలను నిజం చేసాయి. ఆ నలుగురు మిథిలా రాచకన్యలకు, కోసల రాకుమారులతో, ఎంతో వైభవంగా వివాహాలు జరిగాయి. ఆ మంగళకర శుభసమయంలో, మహర్షి పరశురాముడు యేతెంచాడు. శివధనుర్భగం వార్తవిని, అగ్రహోదగ్రుడైన అతడు ఎవరా విల్లు విరిచిన పాతకుడు, అని గర్జిస్తూ కల్యాణ మంటపంలో, ప్రపంచాన్ని బూడిద చేసే మహాగ్ని శిఖలా, భయంకరుడై నిలిచాడు.

శ్రీరాముడు ఆయన సన్నిధిలో నిలిచి అపరాధాన్ని ఒప్పుకుని, క్షమించమని కోరాడు. కొంత మేరకు శాంతించిన ఆ మహర్షి దృష్టి, ఊర్మిళ మీద పడింది. అది గమనించిన ఊర్మిళ , ఆయన పాదాలకు ప్రణమిల్లి వినయ పూర్వకంగా ఇలా అంది.

"పరశువుతో స్వైరవిహారం చేసి, దుష్ట క్షత్రియ సంహారం చేసిన మిమ్మల్ని, సేవించాలన్నది నా చిరకాల కోరిక. నూత్నవధువుగా, మీ నుంచి ఆశీస్సులు పొందే అదృష్టం నాకు కలిగింది. ఎంత మహద్భాగ్యం నాది."

ఆమె మాటలకు మహర్షి మరింత శాంతించాడు.

"మహిళా లోకానికే ఆదర్శమైన వీరనారివి నీవేనా? నీ ఖడ్గచాలన సామర్థ్యం గురించి విన్న నేను నీకు నా బహుమతిగా విష్ణుదేవుని కరవాలమైన నందకిని యివ్వాలని సంకల్పించాను.ఇంత కన్న శుభ సమయం వుండదు. అందుకో. శిష్ట రక్షణకి వుపయోగించు" అంటూ నందకి ఖడ్గాన్ని ఆమె చేతుల్లో పెట్టాడు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైన ఊర్మిళ " మహా ప్రసాదం" అంటూ ఆ కరవాలాన్ని కళ్ళకద్దుకుని మరోసారి మహర్షికి ప్రణమిల్లింది.

క్రోధం శమించి, శాంతం వికసించగా, ఆ మహర్షి జ్ఞాననేత్రాలు విచ్చుకున్నాయి. శ్రీరాముని విష్ణుదేవునిగా గుర్తించి, విష్ణు ధనస్సుని ఆ లోక నాయకునికి అప్పగించి, ఆయన తపస్సుకోసం వెళ్ళిపోయాడు.

మిథిలకు భిన్నంగా వున్న అయోధ్యలో క్రొత్తజీవితం ఊర్మిళకు ఆశాభంగాన్ని కలిగించింది. మహారాజు కాముకత వల్ల మహారాణుల అంతరంగాలలో చెలరేగే ఈర్ష్యాసూయలు.స్పర్ధలు అంతఃపుర వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. సంఘంలో పురుషాధిక్యత వల్ల, సౌశీల్యము, పాతివ్రత్యం స్త్రీలకు ప్రధాన జీవిత విలువలుగా ప్రచారమవుతున్నాయి. అధ్యాత్మికత లోపించి, ఇహలోక భోగ భాగ్యాలపై మోహం యెక్కువగా వుంది. మద్యం,మాదక ద్రవ్యాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. అధికారులలో అలసత్వం, లంచగొండితనం పెరిగిపోయిందని విజ్ఞులు బాధపడుతున్నారు. జన జీవనంలో ధార్మికత, శాంతి లోపించాయి.

ఒక రోజు లక్ష్మణుని దగ్గర ఈ విషయాలను ప్రస్తావించి, ధార్మిక సమాజం కోసం చర్యలెందుకు తీసుకోవటం లేదని ఆరా తీసింది. ఆమె అలా ప్రజాపాలన గురించి మాట్లాడడం లక్ష్మణుడికి నచ్చలేదు.

"స్త్రీలు మంత్రాలోచన చెయ్యవచ్చు. కానీ అది మేము మీ సలహా అడిగినప్పుడే. మిథిలలోలాగ ఇక్కడ కుదరదు. నీకు మహర్షి యిచ్చిన నందకిని నా ఆయుధాగారంలో భద్రపర్చు. దానిని వుపయోగించే అవసరం నీకు రానివ్వను. "

ఆ మాటలు విని ఊర్మిళ హతాశురాలైంది. ఆమె కన్న కలల సౌధం ఆమె ముందే కుప్పకూలింది.

చిన్నబోయిన భార్య ముఖాన్ని చూసి, ఆమె చుబుకాన్ని ఎత్తిపట్టుకుని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ,

"ఈ లోకంలో స్త్రీలకు రాజ్యాధికారం లేదు. అందువల్ల నీవు, రాజ్యపాలన నుంచి నీ దృష్టిని మళ్ళించి, అంతపుర వ్యవహారాలపై పెట్టు. నా తల్లి అడుగుజాడలలో నడిచి మంచి భార్యగా, మంచి కోడలిగా పేరు తెచ్చుకో" అని చెప్పి ఆమెను

బిగి కౌగిలిలో బంధించాడు. అతని కోరిక తీరుస్తున్న ఊర్మిళ మనసులో ఎన్నో ఆలోచనలు. ఆమెకు తల్లి సునయన చేసిన హిత బోధ గుర్తుకు వచ్చింది.

"స్త్రీ జీవితం పెళ్ళికి ముందు, తర్వాత అని రెండు దశలలో వుంటుంది. మొదటి దశ నీ అధీనంలో వుంటుంది. నీవు కోరిన విధంగా నీ శారీరక, మానసిక, అధ్యాత్మిక వికాసాలను నీవు పెంపొందించుకోవచ్చు. వివాహం తర్వాత స్త్రీకి మరో జన్మ ప్రారంభమవుతుంది. ఆ జన్మ కి కావల్సిన విధంగా క్రొత్తగా నిన్ను నువ్వు మలచుకోవాలి. సీత అలా చేయగలదు. ఆమెను అనుసరించు."

అలసి పోయి ప్రక్కకు తిరిగి పడుకున్న భర్తని చూసి, ఇదేనా ఈ పురుషుని శృంగారం? ఇలాగే జీవితమంతా వుంటాడా లేక సరసం నేర్చుకుంటాడా? అతనికి రాముని సేవ తప్ప వేరే దృష్టి లేక పోవడం ఈ ప్రేమ రాహిత్యానికి కారణం కావచ్చునని అనుకుంది.

మరునాడే ఊర్మిళ సీతని కలిసింది. తల్లి సునయన చెప్పినది నిజం చేస్తూ సీత యిలా అంది.

"పతియే ప్రత్యక్ష దైవమనే వంశంలో కోడళ్ళం మనం. ఈ జీవితంలో ప్రేమని భక్తిగా మార్చుకుని సేవాభావంతో మెలగాలి. మనది దాస్యం, సహజీవనం కాదు. కలిసి అన్యోన్యంగా జీవించడమంటే, భార్య తనను తాను త్యాగం చేయ్యడమే."

ఆ మాటలంటూ సీత కన్నీళ్ళు పెట్టుకుంది."నీ గురించే నా బాధ. నీ ఆత్మాభిమానాన్ని, వ్యక్తిత్వాన్ని, నీ ఖడ్గ విద్యని, నీ నందకిని నీవు మర్చిపోవాలి."

ఊర్మిళ సీత కన్నీళ్ళు తుడుస్తూ, " నీ కన్న గొప్పదాన్ని కాదు. దేవతయే సామాన్య స్త్రీలా వుండాల్సి వచ్చిందని నా బాధ." అని తన మనోవేదనను వెలిబుచ్చింది.

కొద్ది సేపైన తర్వాత, ఊర్మిళ బరువెక్కిన గుండెతో సీత వద్ద సెలవు తీసుకుని నేరుగా,అత్తగారి మందిరానికి వెళ్ళింది.

సుమిత్ర ఊర్మిళను వాత్సల్య పూర్వకంగా దీవించి , క్రొత కాపురమెలా వుందని కుశల ప్రశ్నలడిగింది.

ఏం సమాధానమిస్తే బాగుంటుందోనని ఊర్మిళ ఆలోచిస్తూండగా సుమిత్ర ఇలా అంది.

"నీ ముఖంలో ప్రశాంతత లేదు. మిధిలనుంచి వచ్చిన నీకు ఇక్కడ వ్యవహారాలు వింతగా వుంటాయి. ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. రాబోయే కాలం నీది. కొద్ది రోజుల్లో పెనుమార్పులు వస్తాయి. ఒక్క విన్నపం. నాకొడుకు దుష్టుడు కాడు. చిన్ననాటి నుండి వాడు, రామసేవకుడిగా యెదిగాడు. నీ సాంగత్యంలో అతడు సంస్కారి, సరసుడు, సుపరిపాలకుడు అయ్యే రోజు వస్తుంది."

సుమిత్ర మాటలతో ఊర్మిళ మనసు తేలిక పడింది. ఆమె చివరి పలుకులు ఊర్మిళ హృదయాన్ని తాకి, బుగ్గలను రాగ రంజితం చేసాయి.

చూస్తూండగా ఒక యేడాది కాలం గడిచి పోయింది. నలుగురు కొత్త కోడళ్ళు, తమ వినయ సౌశీల్యాలతో గృహిణులుగా మెప్పు పొందారు. ఊర్మిళ తన అత్తగారు సుమిత్ర సూచనల మేరకు తనని తాను మార్చుకునే ప్రయత్నంలో చాలా వరకు విజయం సాధించింది. అంతలో ఊహకందని విషాద సంఘటనలు చోటు చేసుకున్నాయి.

దశరధుడు అకస్మాత్తుగా రామ పట్టాభిషేకాన్ని ప్రకటించడం నచ్చని కైకేయి, రాముని పదునాలుగేండ్లు వనవాసానికి పంపాలని, భరతుడికి రాజ్యమివ్వాలని పట్టు బట్టింది. అందరూ కైకేయిని వంచకురాలని, ద్రోహి అని తిడుతున్నారు. ఊర్మిళకు అది నచ్చలేదు. భార్య కిచ్చిన మాటను విస్మరించిన దోషం దశరధునిది. కానీ నిందను కైక భరించాల్సివచ్చింది. నిజానికి ఆయన తన ముగ్గురు ప్రధాన భార్యలను సమావేశపరిచి, పట్టాభిషేక విషయాన్ని చర్చించి వుంటే ఈ ఉపద్రవం, ఈ పరాభవం, తప్పేవి. దీనికంతటికీ మూల కారణం పక్షపాతం, పురుషాధిక్యతాభావమేనని చింతించింది

రాముడు వనవాసానికి బయలుదేరాడు. అతనితో సీత బయలుదేరింది. ప్రాణానికి ప్రాణమైన సీత వనవాసానికి వెళ్ళ వలసి రావడం ఊర్మిళ మనసుని బాధతో మెలిపెట్టింది. లక్ష్మణుని ప్రవృత్తి తెలిసిన ఆమె జరగబోయేది ముందే వూహించింది. లక్ష్మణుడు,ఊర్మిళ దగ్గర సెలవు తీసుకోవడానికి వచ్చి, నిర్వికారంగా ఇలా అన్నాడు

"అన్నగారితో వనవాసానికి వెడుతున్నాను. "

"నేనూ నా అక్క సీతలా పతివ్రతనే. నన్ను మీతో రానివ్వండి" అని ప్రాధేయపడింది ఊర్మిళ. ఆమెది భర్తనే గాక, సీతని కూడా విడిచి వుండలేని పరిస్థితి.

"నీవు నాతో వస్తే, నేను నా సేవక విధిని సంపూర్ణంగా నిర్వర్తించడం కుదరదు. అదీగాక నువ్వు నా ప్రతినిధిగా ఇక్కడ వుండి, అమ్మ సుమిత్రాదేవిని, నిర్భాగ్యురాలు కౌసల్యా మాతను సంరక్షించాలి.

భరత శతృఘ్నులు రాజ్యపాలనలో నిమగ్నమై వారి యోగక్షేమాలను పట్టించుకోలేరు. దుష్ట మంధర ప్రోద్బలంతో అహంకారి కైకేయి, వారిని ఇబ్బందుల పాలు చెయ్యవచ్చు."

" భర్త విడిచి వెళ్ళిన స్త్రీ గా నాకేం అధికారాలుంటాయి, అవమానాలు తప్ప. మీ తల్లుల గురించేగాని, నా గురించి మీరు ఆలోచించడం లేదు."

"ఊర్మీ! ఒక సామాన్య స్త్రీలా బేలగా మాట్లాడకు. నీ పరాక్రమం గురించి, పరశురామ దత్త నందకి గురించి, అందరికీ తెలుసు. నాలా ఆవేశంలో కత్తి ఝళిపిస్తావామోనని మంధరకు కూడా భయమే! అంతేగాక, భరతుడికి నీ

రాజనీతిజ్ఞత తెలుసు. నీ సలహాలు తీసుకోకుండా వుండడు. సంకోచాలన్నీ విడిచి పెట్టి, నిశ్చింతగా జీవించు. పెద్దలకు రక్షగా వుండు.”

" ఒక సారి ఆలోచించండి. మీరు రాముని, నేను సీతని సేవించవచ్చు. మనం వంతుల వారీగా మేల్కొని వుండి వారిని కాపాడ వచ్చు."

"అది నాకు సమ్మతం కాదు. అయితే, నీ నుంచి నాకు సహాయం కావాలి. దానివల్ల ఇక్కడే వుండి కూడా, నీవు ఈ లోకానికి, నీ పాత్రివ్రత్యాన్ని నిరూపించవచ్చు.”

“సుమిత్రా పుత్రులు నన్ను క్షమించాలి. నేను మన ప్రేమ కోసం ప్రాణమైనా ధారపోస్తాను. లోకం మెప్పు నా కక్కరలేదు." ఆత్మాభిమానంతో కూడిన ఆమె విస్పష్ట సమాధానం, లక్ష్మణుడి హృదయాన్ని తాకింది.

"నేను సుమిత్రా పుత్రుడినే కాదు. ఈ ముద్దుగుమ్మ పతినికూడా. ఊర్మీ, నా ప్రియ సఖీ! స్త్రీలు ప్రేమ మూర్తులని భర్తని ప్రాణాధికంగా ప్రేమిస్తారని నిన్ను, వదినె సీతను చూస్తే తెలుస్తోంది." భర్త కంఠంలోని మార్దవం, ప్రేమా ఆమెను కదిలించాయి.

ఆమె అతడి వక్షస్థలం పైన తల ఆనించి, " సెలవివ్వండి. నేను మిమల్ని యే విధంగా సేవించుకోగలనో" అని అనునయంగా అడిగింది.

“నిద్రాదేవి నాకు నిద్ర రాకుండా వరమిచ్చింది. అయితే నా బదులు నీవు నిద్రపోవాల్సి వుంటుంది."

"మంచి వరమే. ప్రతి రోజూ నిశ్శబ్ద, నిశీధిలో మీ అర్ధాంగిని మీరు జ్ఞాపకం చేసుకునే వరం.

అంతః పురములో నన్ను కట్టి వుంచే వరం. వెళ్ళిరండి." అంది ఊర్మిళ విరక్తిగా.

ఊర్మిళ త్యాగానికి, ప్రేమకి లక్ష్మణుడి మనసు కృతజ్ఞతా భారంతో బరువెక్కింది. అతడి కనులు చెమరించాయి. భర్త మానసిక స్థితిలో వచ్చిన మార్పుని చూసి, చలించిన వూర్మిళ అతడిని గాఢంగా కౌగలించుకుని, " పదునాలుగేండ్ల ఎడబాటు మీరు సహించగలరేమో గానీ, నా వల్ల కాదు.మీ స్మరణలో జీవిస్తాను" అంటూ ఉబికి వచ్చే కన్నీటిని నిలువరిస్తూ, లక్ష్మణునికి వీడ్కోలు పలికింది.

రెండు రోజుల తర్వాత జరిగిన నాటకం, రఘువంశీయులకు స్త్రీల పట్ల అంతర్లీనంగా వున్న చులకన భావాన్ని, ధర్మమూ, సత్య వాక్పాలన , ఆశ్రిత జన రక్షణ వంటి వారి నియమాల్లోని డొల్లతనాన్ని తేటతెల్లం చేసాయి.

భార్యను దోషిని చేసి మరణించిన దశరధుడు, కత్తితో తల్లి తల తెగనరుకుతానన్న భరతుడు,తండ్రీ ! తప్పు చేసాను, తిరిగి వచ్చి రాజ్యమేలుకో అని పాదాలు పట్టుకున్నా తల్లి కైకేయిని కనికరించని రఘురాముడు. వీళ్ళా భావి ఆదర్శపాలకులు, అని చింతాక్రాంతయైంది.

లక్ష్మణుని జాగరణ వర ప్రభావం వల్ల, ఊర్మిళ అయోధ్యలో అధికంగా నిదురిస్తూ, లక్ష్మణుని ప్రతిబింబంగా రూపొందింది. అత్త సుమిత్ర కేగాక, కౌసల్యా , కైకేయిలకు గూడా ఆప్తురాలిగా, సంరక్షకురాలిగా యెదిగింది. అంతపుర పాలన సమర్ధవంతంగా నిర్వహిస్తూ, ప్రజ్ఞావంతురాలిగా, కరుణామూర్తిగా పేరు తెచ్చుకుంది . ఎంత మంది ఆమె చుట్టూ వున్నా ఆమె ఒంటరిదే. ప్రాణానికి ప్రాణమైన సోదరి, ప్రియమైన భర్త దూరమైన బాధని దిగమ్రింగుతున్నఆమె అంతరంగం, అగ్ని పర్వతాన్ని కడుపున దాచుకున్న ప్రశాంత గంభీర జలనిధిగా మారింది. రాజర్షి కూతురిగా పెరిగిన ఆమె వేదాంతియై, ఇంద్రియాలను నియంత్రించి రాజయోగినిగా మారిపోయింది.

Note: This narrative is based on different sources. Principal among them are:

1. Kane, Kavita. *Sita's Sister*. New Delhi: Rupa Publications, 2016. Print.

2. Dewan, Smriti, "*The forgotten princess*, Bloomsbury India, 2021, E. book.

3. Sahu and Sahu, Urmila: An Epitome of Female Resilience in the context of Mythology, International Journal of Humanities and Arts 2025; 7(2): 322–326.

★★★★